# భక్తి శ్రద్ధలతో మొహరం పండుగ



**మర్రిగూడ, జూన్ 26( మహా ప్రభ)**
మర్రిగూడ మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం నుంచి పీర్ల ఊరేగింపు ఘనంగా జరిగింది. గ్రామంలోని ప్రతి ఇంటికి పీర్లు చేరగా, భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.మొహరం పండుగను హిందువులు--ముస్లింలు కలిసి ఎంతో వైభవంగా జరుపుకుంటారు. పీర్లకు దట్టీలు, కుడుకలు, బెల్లం సమర్పించి ప్రత్యేక ప్రార్ధనలు చేసి తమ కోరికలను తీర్చుకోవాలని భక్తులు ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు యాసీన్ అలీ, మహమ్మద్ జబ్బార్, అంజాద్ అలీ, ఆసిన్ నవీన్, జాము ఖదీర్తో తదితరులు పాల్గొన్నారు

# తిరుమలలో అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొన్న కరీంనగర్ భక్తులు




**కరీంనగర్ జూన్ 26( మహా ప్రభ)**
తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవిత్ర అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో కరీంనగర్‌కు చెందిన శ్రీ రామదూత భక్త మండలి సభ్యులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. మండలి వ్యవస్థాపకుడు దేవిశెట్టి రామ నాయకత్వంలో భక్తులు "శ్రీరామ జయరామ జయ జయ రామ", "గోవింద నామ స్మరణ" వంటి దివ్య నామాలను ఆలపిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు.వారి భక్తి గానం తిరుమల క్షేత్రానికి విచ్చేసిన వేలాది మంది భక్తులను ఆకట్టుకొని, హరినామ సంకీర్తనలో ముంచెత్తింది. ఈ సందర్భంగా దేవిశెట్టి రామ మాట్లాడుతూ, "శ్రీహరి నామస్మరణ ప్రతి మనిషి జీవితానికి శాంతి, సుఖసంతోషాలు, ఆధ్యాత్మిక చైతన్యం ప్రసాదిస్తుంది" అని పేర్కొన్నారు. ఇటువంటి దివ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రామదూత భక్త మండలి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని, భక్తి భావంతో హరినామ సంకీర్తనను ఘనంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది.

# కల్వకుర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ శాలినికి ఘన సన్మానం



**కల్వకుర్తి, జూన్ 26( మహా ప్రభ)**
కల్వకుర్తి పట్టణ కేంద్రంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్టీసీ డిపో మేనేజర్ శాలినిను జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి తాలూకా అధ్యక్షుడు షాంపూరి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, జిల్లా మహిళా ప్రచార కార్యదర్శి దొడ్డి మణెమ్మ పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.జిల్లా ఉపాధ్యక్షుడు రావుల శ్రీనివాసులు (దళిత రత్న) మాట్లాడుతూ, "ప్రభుత్వ అధికారులు ప్రజలకు సేవాభావంతో పనిచేయాలి. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా కృషి చేయాలి" అని సూచించారు. నూతన డిపో మేనేజర్ శాలిని ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ జనరల్ సెక్రటరీ పెరమళ్ళ అంజయ్య, డివిజన్ ఉపాధ్యక్షుడు సామ బాలరాజ్, మార్చాల గ్రామ అధ్యక్షుడు సామరాజు, దువ్వాసి యాదయ్య (ఆర్టీసీ కండక్టర్), మాల మహానాడు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల విస్తృత తనిఖీలు

**కరీంనగర్ రూరల్, జూన్ 26( మహా ప్రభ)**



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు శుక్రవారం ఉదయం 10 గంటల నుండి నగరంలోని పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో డాగ్ స్క్వాడ్ సహాయంతో పాన్ షాపులు, హుస్సేనిపుర రైల్వే స్టేషన్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ప్రతీమ మెడికల్ కాలేజీ పరిధిలోని దుకాణాలు పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలను క్షుణ్ణంగా పరిశీలించినప్పటికీ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.ఇకపై పాన్ షాపులు, కిరాణా దుకాణాల్లో నిషేధిత వస్తువులు విక్రయించినచో వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ గాలింపు చర్యల్లో రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, మహిళా సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# నల్గొండలో వీడిన మర్డర్ మిస్టరీ







**- నలుగురు అరెస్ట్**

**నల్గొండ, జూన్ 26( మహా ప్రభ)**
నల్గొండ పట్టణంలోని తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సభ్యులు హత్యకు గురైన ఘటనలో పోలీసులు కేవలం మూడు రోజుల్లోనే నిందితులను పట్టుకుని రిమాండ్‌కు పంపించారు.జూన్ 22న సాయంత్రం స్థానికులు ఇంట్లో మృతదేహాలు కుళ్లిపోవడంతో తీవ్ర దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో దర్యాప్తు ప్రారంభించారు.డీఎస్పీ శివరాం రెడ్డి ఆధ్వర్యంలో ఏడు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ వద్ద అదుపులోకి తీసుకున్న నిందితులు విచారణలో నేరాన్ని అంగీకరించారు.నిందితులు -- సయ్యద్ అస్లాం, తబస్సుం, మహమ్మద్ సోహైల్, హేమంత్ కుమార్. వీరు వ్యక్తిగత కక్షలు, అప్పులు, డబ్బు, బంగారు ఆభరణాల కోసం కుట్ర పన్ని హత్యలు చేసినట్లు నిర్ధారణ అయింది.పోలీసులు నిందితుల వద్ద నుంచి రూ. 30 లక్షల నగదు, మహీంద్రా మరాజో కారు, ఐదు తులాల కరిగించిన బంగారు ముద్ద, మూడు సెల్‌ఫోన్లు, హత్యకు ఉపయోగించిన కత్తి, ల్యాండ్ మరియు బ్యాంక్ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, కేవలం మూడు రోజుల్లోనే నిందితులను పట్టుకున్న పోలీసు బృందాలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు.

# డ్రగ్స్‌కు నో చెప్పండి

**- జీవితానికి అవును చెప్పండి**
**- హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో**
**ఘనంగా మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం**



**కరీంనగర్, జూన్ 26( మహా ప్రభ)**
కరీంనగర్ నగరంలోని 36వ డివిజన్ మారుతీనగర్లో హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన, విలువలతో కూడిన జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు.మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు. యువతతో కలిసి "డ్రగ్స్‌కు నో చెప్పండి -- జీవితానికి అవును చెప్పండి", "మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి -- ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తోడ్పడండి" అనే నినాదాలతో అవగాహన కల్పించారు. అనంతరం మాదకద్రవ్యాల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో 36వ డివిజన్ కార్పొరేటర్ తోట అనిల్, సంస్థ కోశాధికారి టి. తిరుపతి, సభ్యులు శేఖర్, కళ్యాడపు నరేష్, సదానందం, విజయ్, సిహెచ్. మాధవ్, యువత, ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# దివంగత వడ్డే రాజుకు ఘన నివాళి



**ఆమనగల్లు,జూన్ 26( మహా ప్రభ)**
తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామానికి చెందిన వడ్డే రాజు గురువారం రాత్రి మృతి చెందగా, విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, ఆమనగల్లు 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము శుక్రవారం గ్రామానికి వెళ్లి మృతుడి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం కల్పించారు. దివంగతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సొల్లు రంగమ్మ--సుధాకర్, ఉపసర్పంచ్ రవీందర్ రెడ్డి, రామన్న మిత్ర మండలి సభ్యులు శ్రీను నాయక్, ప్రేమ్, ఆరెకటిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జహంగీర్ జీ, జంగయ్య గౌడ్, శంకర్ జీ, శేఖర్ యాదవ్, రాములు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# బోగస్ ఓట్ల తొలగింపే లక్ష్యం

**- ఎస్ఐఆర్ ప్రక్రియపై డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు స్పష్టత**




**కరీంనగర్, జూన్ 26( మహా ప్రభ)**
ఓటరు జాబితాను శుద్ధి చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు స్పష్టం చేశారు.కరీంనగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "చనిపోయిన వారి ఓట్లు, వలస వెళ్ళిన వారి పేర్లు, అర్హత లేని ఓటర్ల నమోదు -- ఇవన్నీ తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యం. ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు ఉండాలి, కానీ అర్హత లేని ఓటు జాబితాలో ఉండటం చట్ట విరుద్ధం" అని అన్నారు.ప్రస్తుతం పట్టణీకరణ పెరగడంతో ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉండటం, పాత జాబితాల్లో మరణించిన వారి పేర్లు కొనసాగడం వంటి సమస్యలు ఉన్నాయని ఆయన వివరించారు. ఈ పరిస్థితుల్లో ఓటర్ల జాబితాను శుద్ధి చేయడం అత్యవసరమని చెప్పారు.పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఇప్పటికే ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగిందని, ఎక్కడా మైనారిటీ ఓట్లను లక్ష్యంగా పెట్టి తొలగించలేదని ఆయన స్పష్టం చేశారు. "ప్రజలను తప్పుదోవ పట్టించే తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు సురక్షితమే. కేవలం బోగస్ ఓట్లు మాత్రమే తొలగించబడతాయి" అని ఆయన అన్నారు.కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఒక వార్డులో 17 మంది మరణించిన వారి పేర్లు జాబితాలో ఉన్న ఉదాహరణను చూపిస్తూ, "ఇలాంటి తప్పులు సరిదిద్దకపోతే ఓటింగ్ శాతం పెరగదు. సరైన ఓటర్ల జాబితా ఉండటమే ప్రజాస్వామ్యానికి బలం" అని పేర్కొన్నారు.ఈ సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు బండారి వేణు, కేపిపి చంద్ర, పొన్నం లక్ష్మీ, మొండయ్య, తోట అనిల్, కర్రె అనిల్తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# మునుగోడు ఎంపీడీవోగా వెంకటేశ్వర్ రెడ్డి నియామకం

**మునుగోడు: జూన్ 26( మహా ప్రభ)**
రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పంచాయతీ అధికారి గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్ రెడ్డికి పదోన్నతి లభించింది. ఆయన ప్రమోషన్‌పై నల్గొండ జిల్లా మునుగోడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి గా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి.మొయినాబాద్ మండలంలో సుదీర్ఘ కాలం సేవలందించిన ఆయన, ఇకపై మునుగోడు మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల పర్యవేక్షణ బాధ్యతలను స్వీకరించనున్నారు. వెంకటేశ్వర్ రెడ్డి పదోన్నతి పొందడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, తోటి ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



